

మోసపూరితం

పత్తి రైతులకు కష్టాలు తొలగటం లేదు. ఏటేటా పంట దిగుబడులు రాక ఓ పక్క ఆపసోపాలు పడుతుంటే.. విత్తనాలు నాణ్యమైనవి లేకపోవడంతో సాగు చేసిన పంట చేతికొస్తుందా లేదా అన్న మీమాంసలో ఆందోళన చెందుతున్నారు. విత్తనోత్పత్తిలో ఏటా మోసానికి గురికాక తప్పడం లేదు. జోగులాంబ గద్వాల జిల్లాలోని పలు ప్రాంతాల్లో దాదాపు 250 ఎకరాల్లో సాగు చేసిన పత్తి రైతులు తీవ్రంగా నష్టాలపాలయ్యారు. పత్తి విత్తనోత్పత్తి కోసం ఓ ప్రైవేట్ కంపెనీ ఇచ్చిన విత్తనాలు సాగు చేయగా.. నెలన్నర రోజుల తర్వాత సీడ్ క్రాసింగ్ కోసం సిద్ధమవ్వగా, ఆ పత్తి మొక్కలు బెరుకువిగా గుర్తించడంతో లబోదిబోమంటున్నారు.



బెరుకు మొక్కలను చూపిస్తున్న రైతులు

- నిండా మునిగిన సీడ్ పత్తి రైతులు
- సీడ్‌కు బదులు కమర్షియల్ విత్తనాల పంపిణీ
- 45 రోజుల తర్వాత గుర్తింపు
- 25శాతం కూడాలేని విత్తనోత్పత్తి మొక్కలు
- వాటితోనే వ్యవసాయం చేయాలంటున్న కంపెనీ

గద్వాల, జూలై 17: పత్తి విత్తనోత్పత్తిలో ప్రతీ ఏడాది రైతులు మోసపోతూనే ఉన్నారు. పత్తి విత్తనాలు విత్తిన 30రోజుల తర్వాతనే వారు వేసిన పత్తి విత్తనాలు నాణ్యమైన విత్తనాలా..? నాణ్యతలేని విత్తనాలా..? పూత వస్తుందా.. రాదా..? అనేది బయటపడుతుంది. అవి నాణ్యత లేనివి, పూతరానివి ఉంటే అప్పటి వరకు పెట్టిన పెట్టుబడిని రైతులు నష్టపోవాల్సిన పరిస్థితి ఉంది. ఇలా ప్రతీ ఏడాది రైతులు నష్టపోతున్నట్లే.. ఈ ఏడాది కూడా ఓ కంపెనీకి సంబంధించిన విత్తనాలు వేసిన రైతులు వాటిలో 75శాతం కమర్షియల్ విత్తనాలేనని గుర్తించి లబోదిబోమంటున్నారు.

విత్తనాల పంపిణీలో పొరపాటు జరిగినట్లు గుర్తింపు

పంటలను పరిశీలించిన కంపెనీ ప్రతినిధులు, సీడ్ ఆర్గనైజర్ విత్తనాల పంపిణీలో పొరపాటు జరిగినట్లు గుర్తించారు. అయితే వేసిన పంటలో 25శాతంకు పైగా పత్తి విత్తనోత్పత్తి మొక్కలు ఉన్నాయని బెరుకు మొక్కల మొగ్గలను తుంచి వేసి సీడ్ మొక్కలతో వ్యవసాయం చేయాలని సూచిస్తున్నారని రైతులు తెలిపారు. ఈ విధంగా చేస్తే ఎకరాకు ఆరు క్వింటాళ్లు వచ్చే దిగుబడి రెండు క్వింటాళ్లకు పడిపోతుందని, అదేవిధంగా మేము చేసిన కష్టం, పెట్టిన పెట్టుబడి నష్టపోవాల్సి వస్తుందని రైతులు అంటున్నారు. కంపెనీ మాత్రం వచ్చిన దిగుబడిలో ప్యాకెట్‌పై రూ.100లు అదనంగా ఇస్తామంటే కూడా తీవ్రంగా నష్టపోతామని రైతులు వాపోతున్నారు. ఇప్పటికే ఎకరాకు రూ.50వేల వరకు పెట్టుబడి పెట్టామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాకు జరిగిన నష్టాన్ని కంపెనీ పూర్తిగా భరించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

250ఎకరాలలో రైతులకు నష్టం

జోగుళాంబ గద్వాల జిల్లా ఇటిక్యాల మండలం బుడ్డారెడ్డి పల్లి, మల్దకల్ మండలం, గార్లపాడు, తాటికుంట, ఎద్దులగూడెం, అయిజ మండలం తూంకుంట ఇలా దాదాపు 15గ్రామాల్లో 250ఎకరాలలో పత్తిని సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు. పత్తి విత్తనోత్పత్తికోసం ఓ ప్రయివేటు కంపెనీ ఇచ్చిన విత్తనాలను సీడ్ ఆర్గనైజర్ ద్వారా తీసుకొని సాగు చేశారు. దాదాపు 45రోజుల తర్వాత సీడ్ క్రాసింగ్ కోసం రైతులు సిద్ధం అవుతుండగా సాగు చేసిన పత్తి మొక్కలు కమర్షియల్(బెరుకు) మొక్కలుగా గుర్తించారు. అందులో 20నుంచి 25శాతం మొక్కలు మాత్రమే విత్తనోత్పత్తి(సీడ్) మొక్కలుగా గుర్తించారు. వెంటనే సీడ్ ఆర్గనైజర్‌ను సంప్రదించారు.

కంపెనీతో మాట్లాడుతానంటూ దాటవేదు. రైతులు ఒత్తిడి చేయడంతో కంపెనీ ప్రతినిధులను పిలిపించి పంటలను పరిశీలించారు.

అధికారులు స్పందించాలని వేడుకోలు

కాగా కంపెనీ ఇచ్చిన సీడ్‌తో తాము పూర్తిగా నష్టపోతున్నామని అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగే విధంగా చూడాలని కలెక్టర్‌తో పాటు వ్యవసాయ అధికారులను వేడుకుంటున్నారు. కానీ వ్యవసాయ అధికారులు మాత్రం పత్తి విత్తనోత్పత్తి తమ పరిధిలో లేదని అంటున్నారు. రైతుల అభ్యర్థన మేరకు కంపెనీ ప్రతినిధులను పిలిచి మాట్లాడుతామని అంటున్నారు.

ఈ ఏడాదే నకిలీ విత్తనాలు ఇచ్చారు



ప్రతీ ఏడాది సీడ్‌పత్తి సాగు చేస్తాను. ఇదే ఆర్గనైజర్ దగ్గర విత్తనాలు తీసుకుంటాను. కూలీలు డిమాండ్ ఉండటంతో తక్కువ మంది కూలీలు అవసరం అయ్యే విధంగా ఈ ఏడాది వెరైటీని మార్చాం. కానీ 25శాతం మొక్కలు కూడా సీడ్‌పత్తి మొక్కలు లేవు. అన్ని బెరుకు మొక్కలు. ఇప్పటికే పెద్ద ఎత్తున పెట్టుబడి పెట్టాం. తీవ్రంగా నష్టపోతాం. మాకు కంపెనీ న్యాయం చేయాలి.

- కక్కయ్య, రైతు, బుడ్డారెడ్డిపల్లి, ఇటిక్యాల





సీడ్ విత్తనాలనుకొని సాగు చేసిన పత్తి పంట

ప్యాకెట్‌కు రూ.100 సరిపోవు



మాకు ఇచ్చిన విత్తనాలలో 25శాతం మాత్రమే సీడ్ పత్తివి, వీటితోనే వ్యవసాయం చేయమంటున్నారు. దీని వలన చేసిన కష్టం, కూలీలు, పెట్టుబడి నష్టపోతాం. కంపెనీ వచ్చిన దిగుబడిలో ప్యాకెట్‌కు రూ.100లు ఇస్తానంటే అది దేనికి సరిపోదు. తీవ్రంగా నష్టపోతాం. కంపెనీ మాకు న్యాయం చేయాలి. అధికారులు స్పందించి మాకు న్యాయం జరిగే విధంగా చూడాలి.

- తిమ్మప్ప, రైతు, బుడ్డారెడ్డిపల్లి, ఇటిక్యాల మండలం



కోయిలకొండలో ఆకట్టుకున్న పీర్ల ఊరేగింపు

కోలాహలం

- కోయిలకొండ, ఊట్కూర్‌లలో ఘనంగా పీర్ల ఊరేగింపు
- వేలాదిగా తరలివచ్చిన భక్తజనం
- నిమజ్జనానికి తరలింపు - ముగిసిన మొహర్రం ఉత్సవాలు

కోయిలకొండ/ఊట్కూర్, జూలై 17: కోలాహలంగా పీర్ల ఊరేగింపు కొనసాగింది. పది రోజులుగా పీర్ల చావిడిలో కొలువైన పీర్లకు బుధవారం ప్రత్యేక పూజలు జరిపి నిమజ్జనానికి ఊరేగింపుతో తీసుకువెళ్లారు. కోయిలకొండ, ఊట్కూర్ ప్రాంతాల్లో వేలాది మంది భక్తులు తరలిరాగా, పీర్ల సవార్లతో ముందుకు సాగారు. కోయిలకొండలో బీబీ ఫాతిమాకు మొక్కులు చెల్లించుకున్నారు. కోయిలకొండలో ఎక్కడ చూసినా కందూర్ల స్థావరాలు కనిపించాయి. బుధవారం తెల్లవారు జామున బీబీ ఫాతిమాకు సర్కార్ శక్కర నిర్వహించి ఊరేగింపుకు తరలించారు. ఖిల్లా నుంచి కిందకు బీబీ ఫాతిమా పీరు రాగానే పాత పోలీస్‌స్టేషన్ వద్ద అగ్నిగుండం కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిగుండం కార్యక్రమం పూర్తి కాగానే ఉషన్‌పాషా, చాన్‌దూలతోపాటు మండల కేంద్రంలో ప్రతిష్ఠించిన పీర్లు బీబీ ఫాతిమాను దర్శించుకున్నాయి.

వైభవంగా హసన్ - హుస్సేన్ పీర్ల ఊరేగింపు

ఉమ్మడి జిల్లాలోనే అత్యంత వైభవంగా జరిగే ఊట్కూర్ మొహర్రం ఉత్సవాలు వేలాది భక్తుల నడుమ బుధవారం మండల కేంద్రంలో అత్యంత వైభవంగా జరిగాయి. తెల్లవారు జామున ఐదు గంటలకు ప్రారంభమైన పగలు సవారి గ్రామంలోని వీధుల గుండా కొనసాగుతూ తొమ్మిది గంటల వరకు తిరిగి పీర్ల మస్జీద్‌కు చేరడంతో ముగిసింది. అనంతరం సాయంత్రం 6 గంటలకు ప్రారంభమైన రాత్రి సవారి గ్రామం అంతా తిరుగుతూ రాత్రి 10 గంటల ప్రాంతంలో చెరువు కట్ట అలుగు వద్ద పీర్ల ఉత్సవాలు ముగిశాయి. ఈ ఉత్సవాలను తిలకించడానికి వివిధ ప్రాంతాలకు వలస పోయిన వారు, ఇతర రాష్ట్రాలకు చెందిన భక్తులు భారీగా తరలిరావడంతో పీర్ల మస్జీద్ ప్రాంతం అంతా కూడా గత రాత్రి నుంచే భక్తులతో కిటకిటలాడింది. కోరిన కోరికలను తీర్చే మహిమ గల అన్నదమ్ములకు ఊరి బయట గొర్రె పొట్టేళ్లను కోసి నియాజ్ చేసి ఫాతిహాలు ఇచ్చారు. కొందరు భక్తులు వెండి ఉయ్యాలలను, ధట్టీలను పూల చాదర్లను సమర్పించారు. అనంతరం నారాయణ పాఠశాల సమీపంలో పీర్లను పట్టే వారి వంశంలో పుట్టిన మగబిడ్డను ప్రతీ సంవత్సరం తరహాలోనే ఉయ్యాలలో వేసి ఊపే ఘట్టం ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా నారాయణపేట డీఎస్పీ లింగయ్య, మక్తల్ సీఐ చంద్రశేఖర్ ఊట్కూర్ గ్రామాన్ని సందర్శించి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఊట్కూర్‌లో పగలు సవారి సందర్భంగా ఉయ్యాల ఊపుతున్న పీరు

బహుజన వీరుడు పండుగ సాయన్న

- విగ్రహాన్ని ఆవిష్కరించిన ఎంపీ అరుణ, ఎమ్మెల్యేలు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీహరి, మాజీ మంత్రులు చంద్రశేఖర్, శ్రీనివాస్‌గౌడ్,



విగ్రహావిష్కరణలో ఎంపీ, ఎమ్మెల్యేలు, సంఘం నాయకులు

హన్వాడ, జూలై 17: పండుగ సాయన్న బహుజన వీరుడని, అతని ఆశయ సాధనలో ముందుకు సాగాలని మహబూబ్‌నగర్, మక్తల్ ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, వాకిటి శ్రీహరిలు పిలుపునిచ్చారు. బుధవారం మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పాలమూరు ఎంపీ డీకే అరుణ, మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి, పాలమూరు ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రులు శ్రీనివాస్ గౌడ్, చంద్రశేఖర్, కాంగ్రెస్ నాయకుడు నీలం మధు హాజరై ఆవిష్కరించారు. పండుగ సాయన్న విగ్రహావిష్కరణ కమిటీ అధ్యక్షుడు యాదయ్య అధ్యక్షతన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పాలమూరు, మక్తల్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ పండుగ సాయన్న అనాటి కాలంలో పేదలకు నోటికాడి అన్నమై ఆకలి తీర్చాడని, ధైర్యశీలి అని అన్నారు. ఆయన చూపిన మార్గంలో నడవాలన్నారు. బీసీలు ఐక్యంగా ఉండాలని కోరారు. భావి తరాలు బహుజనుల చరిత్రను తెలుసుకునేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రాష్ట్ర గీతంలో పాఠ్య పుస్తకాల్లో ఆయన పేరు రావడం సంతోషకరమన్నారు.

పాలమూరు జిల్లాను పండుగోల్ల సాయన్న జిల్లాగా పేరు మార్చాలని నాయకులు కోరుతున్నారని, దానికి సమయం వచ్చినప్పుడు ముందుండి నడిపిస్తానని మక్తల్ ఎమ్మెల్యే శ్రీహరి అన్నారు. మన్యంకొండ వద్ద ఎకరా స్థలంలో పండుగ సాయన్న స్మృతివనం, మ్యూజియం, 25 ఫీట్ల విగ్రహం ఏర్పాటుకు ప్రభుత్వంతో మాట్లాడి నిర్మిస్తామని ఎమ్మెల్యే యెన్నం చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పేదల దేవుడు పండుగ సాయన్న అని అన్నారు. బీసీలందరు ఐకమత్యంతో ఉండాలని కోరారు. మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, బీజేపీ నాయకుడు అందె బాబయ్య, కిశోర్, సంజీవ్‌ముదిరాజ్, ఎస్‌పీ వెంకటేష్, సురేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసులు, మాజీ జడ్పీటీసీ నరేందర్, కృష్ణ, కొండ లక్ష్మయ్య, మాజీ ఎంపీపీ వడ్ల శేఖర్, సొసైటీ చైర్మన్, వైస్ చైర్మన్లు వెంకటయ్య, కృష్ణయ్యగౌడ్, జంబులయ్య అన్వర్, ముదిరాజ్ సంఘం నాయకులు, ముదిరాజ్‌లు పాల్గొన్నారు.

109 అధ్యాపక పోస్టుల భర్తీకి

గ్రీన్ సిగ్నల్

- అప్పక్‌పల్లి వద్ద హైటెక్ హంగులతో మెడికల్ కళాశాల
- నారాయణపేట జిల్లా ఆసుపత్రిని జనరల్ ఆసుపత్రిగా అప్‌గ్రేడ్
- రూ. 66.48 కోట్లతో కొనసాగుతున్న జిల్లా ఆసుపత్రి నిర్మాణ పనులు



నారాయణపేట మెడికల్ కళాశాల

నారాయణపేట, జూలై 17: నారాయణపేట జిల్లాలో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభమయ్యేందుకు అడుగులు పడుతున్నాయి. మెడికల్ కళాశాలలో 109 అధ్యాపక పోస్టుల భర్తీకి తెలంగాణ ప్రభుత్వం తాజాగా గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ఫైనాన్స్ (హెచ్ఆర్ఎం)డిపార్ట్‌మెంట్ జీవో నెంబరు 1127, జూలై 13, 2024 ద్వారా ప్రభుత్వ జాయింట్ సెక్రటరీ హరిత ఉత్తర్వులు జారీ చేశారు. దాంతో కాంట్రాక్టు పద్ధతిన నారాయణపేట మెడికల్ కళాశాలలో 109 అధ్యాపక పోస్టుల నియామకానికి మార్గం సుగమం అయింది. ప్రొఫెసర్స్ 25 పోస్టులు, అసోసియేట్ ప్రొఫెసర్స్ 28 పోస్టులు, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ 56 పోస్టులు నియమించనున్నారు. ప్రొఫెసర్స్‌కు రూ. 1,90,000 వేతనం, అసోసియేట్ ప్రొఫెసర్స్‌కు రూ.1,50,000 వేతనం, అసిస్టెంట్ ప్రొఫెసర్స్‌కు రూ. 1,25,000 వేతనం చెల్లిస్తారు. అయితే, ఈ నెల 15న రాష్ట్ర మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ వాణిని సోమవారం హైదరాబాద్‌లో నారాయణపేట ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడి, ప్రిన్సిపాల్‌గా డాక్టర్ రాంకిషన్‌లు కలిశారు. నారాయణపేటలో ఈ ఏడాది ప్రారంభంకానున్న జిల్లా ప్రభుత్వ వైద్య కళాశాలలో సిబ్బంది నియామకాలు, మౌలిక సదుపాయాలపై సమగ్రంగా చర్చించారు. సిబ్బంది నియామకంతో పాటు, మౌలిక సదుపాయాలు కల్పించి ప్రజలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే పర్ణికారెడ్డి స్పష్టం చేశారు.

మెడికల్ కళాశాలలో 109 అధ్యాపక పోస్టుల నియామకానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే జిల్లా ప్రజల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యా సంవత్సరం కౌన్సెలింగ్ ద్వారా వచ్చే 50 మంది విద్యార్థులకు సెప్టెంబరులో మెడికల్ కళాశాల తరగతులు ప్రారంభం కానున్నాయి. నారాయణపేట మండలం అప్పక్‌పల్లి దగ్గర జిల్లా ఆసుపత్రితో పాటు మెడికల్ కళాశాల హైటెక్ హంగులతో నిర్మాణపు పనులు పూర్తి దశకు వచ్చాయి. గత ప్రభుత్వం హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ జిల్లా ఆసుపత్రి ఎన్‌హెచ్ఎం, ఆర్‌వోపీ ద్వారా ఏరియా ఆసుపత్రిని జిల్లా ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేస్తూ నవంబర్ 3, 2021న జీవో 149 ద్వారా జిల్లా ఆసుపత్రి కోసం రూ.66.48 కోట్ల నిధులు మంజూరు చేసింది. ఇందులో రూ.10.48 కోట్లతో ఆధునిక పరికరాలు, రూ.56 కోట్లతో జిల్లా ఆసుపత్రి భవన నిర్మాణం పనులు తుది దశకు చేరుకున్నాయి. అప్పక్‌పల్లి గ్రామ ప్రభుత్వ సర్వేనంబర్ 209లో 20 ఎకరాల విస్తీర్ణంలో జిల్లా ఆసుపత్రి భవన సముదాయాలతో పాటు ఈ ఏడాది మెడికల్ కళాశాల తరగతులు ఆరంభం కానున్నాయి. ఇదివరకు జిల్లా ఆసుపత్రిలో ఉన్న వంద పడకల ఆసుపత్రి 250 పడకలతో అప్‌గ్రేడ్ అయ్యి జనరల్ ఆసుపత్రిగా మారుతుంది. తాత్కాలికంగా పాత జిల్లా ఆసుపత్రి భవనం పైఅంతస్తులోనే మెడికల్ కళాశాలకు వచ్చే 50 మంది విద్యార్థులకు ప్రాక్టికల్స్‌పై వైద్యసేవలను ప్రత్యక్షంగా అవగాహన కల్పించనున్నారు. తరగతులను మాత్రం అప్పక్‌పల్లి దగ్గర ఉన్న జిల్లా ఆసుపత్రి పైఅంతస్తులో నిర్వహించనున్నారు. ఇప్పటికే 105 మంది స్టాఫ్ నర్సులు చార్జ్ తీసుకొని విధుల్లోకి చేరారు. జీవో నంబర్ 120 ప్రకారం సెప్టెంబరు 16, 2023న 433 పోస్టులు మంజూరయ్యాయి. జూలై 5, 2023న మెడికల్ కళాశాల అనుమతి లభించింది. మెడికల్ కళాశాలకు సంబంధించి 105 మంది ఫిబ్రవరి 10 నుంచి 23 వరకు విధుల్లో చేరారు. అదనంగా ఈఎంటీ, ఆఫ్తాలిమిక్, డెర్మాటలజిస్ట్, సైకాలజిస్ట్, బయో కెమిస్ట్రీ, మైక్రో బయోలజీ తదితర అన్నివిభాగాల ద్వారా వైద్య సేవలు అందనుండడం జిల్లా ప్రజలు అదృష్టంగా భావించవచ్చు.

నీలి నీలి ఆకాశం..



నీలి నీలి ఆకాశం ఇద్దామనుకున్నా.. అన్నట్లు ఉన్నదీ దృశ్యం. బుధవారం సాయంసంధ్య వేళ ఆకాశమంతా నీలి రంగు పులుపుకుంది.. పాలమూరు పట్టణానికి అదే రంగు అద్దింది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఎనుగొండ సాంబ శివాలయం వెనుకాల ఈ దృశ్యాన్ని బుధవారం 'ఆంధ్రజ్యోతి' తన కెమెరాలో బంధించింది.

- ఆంధ్రజ్యోతి స్టాఫ్ ఫోటోగ్రాఫర్, మహబూబ్‌నగర్

నాట్లు.. పాట్లు



వర్షాకాలం ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా వరి నాట్లకు నోచుకోని పొలం

- ఆశాజనకంగా లేని వర్షాలు
- వరి సాగుపై నీలినీడలు
- మూడు నియోజకవర్గాల్లో కరువు ఛాయలు
- తుకాలు పోసినా.. నాట్లు వేయడానికి జంకుతున్న రైతులు

నాగర్‌కర్నూల్, జూలై 17 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో వానాకాలం సాగు ప్రశ్నార్థకంగా మారింది. వర్షాకాలం ప్రారంభమై 50 రోజులు గడుస్తున్నా తగిన రీతిలో వరుణదేవుడు కరుణించకపోవడంతో ఆ ప్రభావం పంటలపై పడింది. కృష్ణానదిలో ఆశించిన స్థాయిలో ఇన్‌ఫ్లో లేకపోవడం కారణంగా కేఎల్ఐ కాల్వలు బోసిపోతున్నాయి. దీంతో బోరుబావుల్లో సైతం భూగర్భ జలాలు ఇంకిపోతున్నాయి. జిల్లాలో బోరుబావులు కేఎల్ఐ కాల్వల కింద నారుమడులు పోసి దాదాపు నెలరోజులు కావస్తున్నది. గతేడాది కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా సకాలంలో నీటి విడుదల జరిగింది. ఈ ఏడాది మాత్రం పరిస్థితి అందుకు భిన్నంగా ఉండడంతో నారుమడులు వేసిన రైతులు నాట్లు వేయడానికి వెనకడుగు వేస్తున్నారు. మరోపక్క ఈ సీజన్‌లో పత్తి పంట సాగు చేయడానికి రైతులు ఆసక్తి కనబర్చడం రోహిణికార్తెలో వేసిన పత్తి పంట నాగర్‌కర్నూల్ నియోజకవర్గంలో ఆశాజనకంగా ఉండటంతో కూలీల డిమాండ్ బాగా పెరిగింది. దీని కారణంగా కొద్దిపాటి వరి నాట్లు వేయడానికి కూడా కూలీలు దొరకని పరిస్థితి ఏర్పడింది.

● పాతాళానికి గంగమ్మ..

వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నాగర్‌కర్నూల్ జిల్లాలో భూగర్భ జలాలు పాతాళానికి పడిపోతున్నాయి. 2023 జూన్‌లో అచ్చంపేట నియోజకవర్గంలో 6.39మీటర్ల లోతున్న భూగర్భ జలాలు 3.67మీటర్లకు తగ్గిపోయాయి. కొల్లాపూర్, కల్వకుర్తి, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో కూడా అదే పరిస్థితి నెలకొంది. కల్వకుర్తిలో 5.9మీటర్లు, నాగర్‌కర్నూల్‌లో 4.53మీటర్ల తగ్గుదల ఉంది.

● తగ్గిన సాగు విస్తీర్ణం

జిల్లాలో వర్షాలు లేని కారణంగా సాగు విస్తీర్ణం బాగా తగ్గింది. 2లక్షల 73వేల 720ఎకరాల్లో పత్తి పంటను సాగు చేయాల్సి ఉండగా ఇప్పటి వరకు లక్షా 52వేల 598ఎకరాల్లో పంట సాగైంది. వరి 40వేల 82 ఎకరాల్లో సాగు కావాల్సి ఉండగా ఇప్పటి వరకు 10 వేల 200 ఎకరాల్లో నాట్లు వేశారు. కందులు 3755ఎకరాలకు గాను 2043, మొక్కజొన్న 45వేల 237ఎకరాలకు గాను 12వేల 691ఎకరాల్లో మాత్రమే సాగైంది.

● సమృద్ధిగా వర్షాలు కురిస్తేనే సాగుకు ఇబ్బందులు ఉండవు



ఇప్పటి వరకు సమృద్ధిగా వర్షాలు కురవనే లేదు. దీంతో రైతులు సాగు చేసిన పంటలకు తీవ్ర ఇబ్బందులు నెలకొన్నాయి. ముఖ్యంగా వరి నార్లు నాటేందుకు సమయం వస్తున్నప్పటికీ భూగర్భ జలాలు సరిపడా లేకపోవడం మూలంగా అన్నదాతలు వరి నాట్లు వేసేందుకు ఆలోచన చేసే పరిస్థితి నెలకొంది. కనీసం కేఎల్ఐ కాల్వల ద్వారానైనా నీటి ప్రవాహం జరిగితే కాల్వల వెంట చెరువులు, కుంటలతో పాటు దుందుబీ నదిలో నీటి ప్రవాహం జరిగితే వరి నాట్లకు ఎలాంటి ఇబ్బందులు ఉండవు. లేనట్లయితే వరి నాట్లకు గడ్డుకాలమే.

- గిరిబాబు, సిర్సవాడ గ్రామ రైతు

ముగిసిన ఆత్మకూరు ప్రీమియర్ లీగ్ క్రికెట్ పోటీలు

ఆత్మకూరు, జూలై 17 : ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని మినీ స్టేడియంలో ఆదివారం ప్రారంభమైన ఆత్మకూరు మునిసిపల్ ప్రీమియర్ క్రికెట్ పోటీలు బుధవారం ముగిశాయి. ఈ క్రికెట్ పోటీలలో ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఆ యా వార్డు కాలనీలలో 12 జట్లు పాల్గొనగా ఆత్మకూరు మినీ స్టేడియం జట్టు విన్నర్‌గా, విరాట్ 11 జట్టు రన్నర్‌గా నిలిచాయి. ఈ సందర్భంగా నిర్వాహకులు తహసీల్దార్ నరేందర్ మాట్లాడారు. అనంతరం నిర్వాహకులు నగేష్, మహేందర్, శ్రీధర్ గుప్తా, అఫ్రోచ్, రాకేష్ ప్రతిభ కనబరిచి మొదటి, రెండవ విజేతలకు బహుమతులను అందజేశారు.



ప్రతిభ కనబరిచిన జట్లకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ద్విచక్ర వాహనం అదుపు తప్పి ముగ్గురు యువకులకు గాయాలు

మన్ననూర్, జూలై 17 : నాగర్‌కర్నూల్ జిల్లా అమ్రాబాద్ మండలం శ్రీశైలం-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ద్విచక్ర వాహనం పైనుంచి కిందపడి ముగ్గురు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పదర మండల కేంద్రానికి చెందిన శివకుమార్, శివ, శ్రీకాంత్ అనే యువకులు ద్విచక్ర వాహనంపై శ్రీశైలం వెళ్లి వస్తున్న క్రమంలో మన్ననూరుకు ఎనిమిది కిలోమీటర్ల సమీపంలోని శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై వీరి వాహనం అదుపు తప్పి కిందపడింది. ప్రమాదంలో గాయపడిన ముగ్గురు యువకులకు మన్ననూరు పీహెచ్‌సీలో చికిత్స నిర్వహించారు.

రేపు అరుణాచలానికి ఆర్టీసీ బస్సులు

- గిరి ప్రదక్షిణకు వెళ్లేందుకు ఇదో అవకాశం

కరపత్రం ఆవిష్కరించిన ఆర్టీసీ అధికారులు

జడ్చర్ల, జూలై 17 : తమిళనాడులోని అరుణాచల గిరి ప్రదక్షిణ చేయడానికి వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు సర్వీసులను నడుపుతున్నట్లు ఆర్టీసీ అధికారులు ప్రచారం చేశారు. జడ్చర్ల పట్టణంతో పాటు పరిసర ప్రాంత ప్రజలు ఆర్టీసీ బస్సు సర్వీసుల సేవలను వినియోగించుకో వాలంటూ ఆర్టీసీ కంట్రోలర్ బాలస్వామి, కండక్టర్ శ్రీనివాసరావులు బుధవారం జడ్చర్ల పట్టణంలోని పలు సంఘాల నాయకులను, దుకాణ సముదాయాలలో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ నెల 19న మహబూబ్‌నగర్ బస్ స్టేషన్ నుంచి రాత్రి ఏడు గంటలకు బయలుదేరి 20న ఉదయం కాణిపాకం, సాయంత్రం వెల్లూరులోని గోల్డెన్ టెంపుల్‌లో దర్శనం అనంతరం అరుణాచలానికి చేరుకుంటుందని పేర్కొన్నారు. అరుణాచలంలో గిరిప్రదక్షిణ అనంతరం ఈ నెల 21న సాయంత్రం నాలుగు గంటల నుంచి అరుణాచలం నుంచి బస్సు బయలుదేరి 22న ఉదయం ఐదు గంటలకు మహబూబ్‌నగర్‌కు చేరుకుంటుందని వారు పేర్కొన్నారు.

త్రీడేస్ టోర్నీలో 136 పరుగుల ఆధిక్యంలో జిల్లా జట్టు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 17 : హైదరాబాద్‌లో జరుగుతున్న హెచ్‌సీఏ త్రీడేస్ లీగ్ టోర్నీలో మహబూబ్‌నగర్ జట్టు 136 పరుగుల ఆధిక్యంలో ఉంది. మొదటి రోజు 45 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 146 పరుగులు చేసింది. జట్టులో అబ్దుల్ రఫె 46 పరుగులు చేయగా, శ్రీకాంత్ 40, అరుణ్ కుమార్ 7 పరుగులతో నాటౌట్‌గా నిలిచారు. బుధవారం రెండో రోజు బ్యాటింగ్ చేసేందుకు దిగిన జట్టు 69.1 ఓవర్లలో 251 పరుగులకు ఆలౌట్ అయ్యింది. జిల్లా జట్టు క్రీడాకారుడు షాదాబ్ 64 పరుగులు (అర్ధసెంచరీ) చేసి నాటౌట్‌గా నిలువగా, శ్రీకాంత్‌యాదవ్ 20 పరుగులు చేశాడు. అనంతరం మొదటి ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగిన సాయిసత్యసీసీ జట్టు 54 ఓవర్లలో 119 పరుగులు చేసి ఆలౌట్ అయ్యింది. జట్టులో ప్రేమ్ 45, వినుక 31 పరుగులు చేశారు. జిల్లా బౌలర్లలో జయసింహ 4, శ్రీకాంత్ యాదవ్ 4 వికెట్లతో విజృంభించారు. గురువారం మూడో రోజు జిల్లా జట్టు రెండో ఇన్నింగ్స్ బ్యాటింగ్‌కు దిగనుంది. జిల్లా జట్టు క్రీడాకారులు రాణించడం పట్ల జిల్లా క్రికెట్ సంఘం సెక్రటరీ రాజశేఖర్, సభ్యులు అభినందించారు. జట్టు విజయానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

ప్రభుత్వం విద్యాభివృద్ధికి నిరంతరం కృషి

- ఈనెల 21న కృతజ్ఞత సభ

- పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 17 : కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భాషా పండిట్, పీఈటీలను అప్‌గ్రేడ్ చేసి వారికి పదోన్నతులు కల్పించడం ఎంతో మంది ఉపాధ్యాయులకు మేలు జరిగిందని పీఆర్టీయూ తెలంగాణ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు తెలిపారు. బుధవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తెలంగాణలో గత పదేళ్లుగా ఉన్న ప్రభుత్వం ఉపాధ్యాయుల సమస్యలు పట్టించుకోలేదన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ఆరునెలల్లోనే పెండింగ్‌లో ఉన్న పదోన్నతులు, ఆరేళ్లుగా బదిలీలను పూర్తి చేసిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నిరంతరం విద్యాభివృద్ధికి కృషి చేస్తున్నారని అన్నారు. పాఠశాలలకు ఉచిత విద్యుత్ సౌకర్యం ఇవ్వడమేకాక, అభివృద్ధికి నిధులు కేటాయించిందని గుర్తు చేశారు. బదిలీలు, పదోన్నతుల్లో నిరంతరం కష్టపడి ఆ ప్రకియను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులకు, ప్రజాప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపేందుకు ఈ నెల 21న జిల్లా కేంద్రంలోని అన్నపూర్ణ గార్డెన్స్‌లో సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి మంత్రులు, ఉమ్మడి జిల్లాలోని అందరు శాసన సభ్యులు, శాసన మండలి సభ్యులు, రాష్ట్ర స్థాయి అధికారులు, ఉమ్మడి జిల్లా కలెక్టర్లు, డీఈవోలను ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయూ తెలంగాణ వ్యవస్థాపక అధ్యక్షుడు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బి.రమాకాంత్, వర్కింగ్ ప్రెసిడెంట్ నాగిరెడ్డి, నారాయణపేట జిల్లా అధ్యక్షుడు మహేష్‌కుమార్, రాష్ట్ర నాయకులు భూపతి సింగ్, జైపాల్‌రెడ్డి, భీమ్ రెడ్డి, ఆనంద్, ప్రభాకర్, విజయ్‌భాస్కర్ పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై టీ పాయింట్‌లో చోరీ

జడ్చర్ల, జూలై 17 : జాతీయ రహదారి జడ్చర్ల కొత్తబస్టాండు సమీపంలోని టీ పాయింట్‌లో మంగళవారం రాత్రి చోరీ జరిగిందంటూ హోటల్ యజమాని అబ్దుల్ హాజీ తెలిపారు. జడ్చర్ల మండలం లింగంపేట గ్రామానికి చెందిన అబ్దుల్ హాజీ ప్రస్తుతం జడ్చర్లలో నివాసం ఉంటూ టీ హోటల్‌ను నడుపుకుంటున్నాడు. రోజు మాదిరిగానే మంగళవారం రాత్రి హోటల్‌ను మూసివెళ్లిన, బుధవారం ఉదయం ఎనిమిది గంటల సమయంలో వెళ్లగా తాళాలు విరగ్గొట్టి ఉన్నాయని పేర్కొన్నారు. రెండు సిలిండర్‌లు, సుమారు రూ.7వేల విలువగల సిగరెట్ ప్యాకెట్లతో పాటు రూ.12వందల నగదు చోరీ అయ్యాయని తెలిపారు. జరిగిన సంఘటనపై పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు బాధితుడు తెలిపారు.

కొలిక్కిరాని శ్రీధర్ రెడ్డి హత్య కేసు

- రెండు నెలలు కావస్తున్నా ముందుకు సాగని దర్యాప్తు

- శ్రీధర్ రెడ్డి హత్యపై స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి

- డీజీపీ ఆదేశాలతో ఘటనా స్థలాన్ని పరిశీలించిన ఐజీ, డీఐజీ



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఐజీ, డీఐజీ, ఎస్పీ

వనపర్తి క్రైం, జూలై17: జిల్లాలో సంచలనం సృష్టించిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి హత్య కేసు రెండు నెలలు కావస్తున్న కొలిక్కి రావడం లేదు. మే 22న చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మిపల్లి గ్రామానికి చెందిన బీఆర్ఎస్ పార్టీ నాయకుడు శ్రీధర్ రెడ్డి తన ఇంటి సమీపంలోని కల్లం వద్ద నిద్రిస్తుండగా అర్ధరాత్రి హంతకుల చేతిలో దారుణ హత్యకు గురయ్యాడు. ఈ హత్య ఉదాంతం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. మాజీ ఎమ్మెల్యే హర్షవర్ధన్‌రెడ్డికి ప్రధాన అనుచరుడైన శ్రీధర్ రెడ్డి హత్యతో బీఆర్ఎస్ పార్టీ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకుంది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హత్య జరిగిన మరుసటి రోజు లక్ష్మిపల్లి గ్రామానికి వచ్చి శ్రీధర్ రెడ్డి అంత్యక్రియల్లో పాల్గొనడంతో పాటు హంతకులను పట్టుకోవాలని రాస్తారోకో చేశారు. ఈ విషయంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు ఒకరిపై ఒకరు పరస్పర ఆరోపణలు చేసుకున్నారు. మంత్రి జూపల్లి కృష్ణారావు అనుచరులే ఈ హత్య చేయించారని కేటీఆర్ ఆరోపించడం.. వ్యక్తిగత కారణాలతోనే శ్రీధర్ రెడ్డి హత్యకు గురయ్యాడని జూపల్లి స్పందించడం ఈ హత్యకు రాజకీయ రంగు పులుముకుంది. సోషల్ మీడియా వేదికగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పరస్పర ఆరోపణలు చేసుకోవడం పోలీసులకు తలనొప్పిగా మారిన విషయం తెలిసిందే.

రెండు నెలలుగా విచారణ

శ్రీధర్ రెడ్డి హత్య జరిగి రెండు నెలలు కావస్తున్న పోలీసులు విచారణ చేస్తున్నారే తప్పా హంతకులను పట్టుకోవడంలో పూర్తిగా విఫలమయ్యారు. లక్ష్మిపల్లి గ్రామంలో పికెటింగ్ ఏర్పాటు చేసి ప్రతీ ఇంటికి తిరిగి విచారణ చేపట్టిన ఈ కేసు విచారణ కొలిక్కి రాలేదు. దీంతో బాధిత కుటుంబ సభ్యులు కూడా ఈ కేసు విషయంపై డీజీపీకి కూడా ఫిర్యాదు చేశారు. అయినా కూడా ఈ కేసు కొలిక్కి రాలేదు. రెండు రోజుల క్రితం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కలెక్టర్లు , ఎస్పీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో శ్రీధర్ రెడ్డి హత్య గురించి గుర్తు చేశారు. హత్య జరిగి రెండు నెలలు అవుతున్నా నిందితులను పట్టుకోవడంలో ఎందుకు విఫలమయ్యారని పోలీసు అధికారులను ప్రశ్నించారు. వెంటనే ఒక కమిటీ వేసి నిందితులను త్వరగా పట్టుకోవాలని ఆదేశించడంతో పోలీసులు రంగంలోకి దిగారు.

డీజీపీ ఆదేశాలతో..

ఈకేసులో ఉన్న హంతకులను త్వరగా పట్టుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పోలీసు ఉన్నతాధికారులను ఆదేశించడంతో డీజీపీ ఆదేశాల మేరకు ఐజి సత్యనారాయణ, డీఐజీ ఎల్ఎస్ చౌహన్, ఎస్పీ గిరిధర్ రావు బుధవారం గ్రామంలో హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు. శ్రీధర్ రెడ్డి కుటుంబ సభ్యులతో పాటు గ్రామస్తులతో మాట్లాడారు. అనంతరం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... శ్రీధర్ రెడ్డి హత్యపై ఎస్పీ ఆర్.గిరిధర్ రావు ఆధ్వర్యంలో డీఎస్పీ కృష్ణ కుమార్, సీసీఎస్ సీఐ తో పాటు ఆత్మకూరు సీఐ శివకుమార్‌లతో కలిసి విచారణ కమిటీ వేసి త్వరలోనే నిందితులను పట్టుకుంటామన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకుని ఈ కేసులో ఉన్న నిందితులను ఎట్టి పరిస్థితుల్లో వదిలిపెట్టే ప్రసక్తి లేదని తెలిపారు. ఈ కేసు విచారణకు గ్రామస్థులతో పాటు కుటుంబ సభ్యులు కూడా సహకరించాలని కోరారు. సాక్షాత్తు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ కేసుపై స్పందించారని, కొత్తగా వచ్చిన ఎస్పీ గిరిధర్ రావు కూడా ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకుని నిందితులను త్వరలోనే పట్టుకుంటామని తెలిపారు.

లొద్ది మల్లయ్య దర్శనానికి

అనుమతులిచ్చి అడ్డుకోవడమేంటి?

- అటవీ అధికారుల తీరుకు నిరసనగా హిందూ సంఘాల ఆధ్వర్యంలో శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై ధర్నా



శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై బైఠాయించి ఆందోళన నిర్వహిస్తున్న హిందూ సంఘాల నాయకులు

మన్ననూర్, జూలై 17 : నాగర్‌కర్నూల్ జిల్లాలోని నల్లమలలో వెలసిన లొద్దిమల్లయ్య క్షేత్రంలో తొలి ఏకాదశి రోజు దర్శనానికి వెళ్లే భక్తులకు ఓ వైపు అనుమతులిస్తామని చెప్పి బుధవారం భక్తులనెవ్వరినీ లోపలికి వెళ్లేందుకు అనుమతులు లేవని గుండం రహదారి వద్ద అడ్డుపడిన అటవీ అధికారుల తీరును వ్యతిరేకిస్తూ హిందూ సంఘాల నాయకులు శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై బైఠాయించి, రాస్తారోకో నిర్వహించారు. బుధవారం ఉదయం లొద్ది దర్శనానికి వెళుతున్న భక్తులను అటవీ అధికారులు అడ్డుకోవడంతో విషయం తెలుసుకున్న బీజేపీ హిందూ సంఘాల నాయకులు గుండం రహదారి వద్దకు చేరుకొని ఆందోళన చేపట్టారు. రాస్తారోకోనుద్దేశించి బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మండికారి బాలాజీ మాట్లాడారు. రెండురోజుల క్రితం అచ్చంపేట అటవీశాఖ డీఎఫ్‌వో కార్యాలయం వద్ద హిందూ సంఘాల ఆధ్వర్యంలో ధర్నా చేశామని, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సైతం డీఎఫ్‌వో రోహిత్‌గోపిడితో మాట్లాడగా అనుమతిస్తున్నట్లు చెప్పి మళ్లీ మాట మార్చారని పేర్కొన్నారు. బుధవారం ఉదయం నుంచి గుండం గేటు వద్ద భక్తులను వెళ్లనీయకుండా అటవీ అధికారులను మొహరింపజేసి హిందువుల మనోభావాలతో ఆడుకోవడమేంటని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ స్థానిక ఎమ్మెల్యే ఆదేశాలకు సైతం గౌరవమివ్వని డీఎఫ్‌వో రోహిత్‌గోపిడి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాస్తారోకోతో శ్రీశైలం-హైదరాబాద్ రహదారిపై వెళ్లే వాహనాలు నిలిచిపోవడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. చివరకు అనుమతిస్తున్నట్లు డీఎఫ్‌వో ఫోన్‌లో తెలుపడంతో హిందూ సంఘాల నాయకులు ఆందోళనను విరమించారు. కార్యక్రమంలో హిందూ సంఘాల నాయకులు శ్రీనునాయక్, నేముల శంకర్ గౌడ్, రాము, నవీన్, నరేష్ తదితరులున్నారు.

నిజాయితీకి మారుపేరు మాజీ మంత్రి మహేంద్రనాథ్

- నేటి తరానికి ఆదర్శం

- మాజీ మంత్రి మహేంద్రనాథ్ విగ్రహావిష్కరణ సభలో వక్తల వెల్లడి

పెద్దకొత్తపల్లి, జూలై 17 : నీతి నిజాయితీ, నైతిక విలువలకు మారుపేరు మాజీ మంత్రి పట్టపాగ మహేంద్రనాథ్ అని పలువురు వక్తలు అన్నారు. ప్రజానేత, విద్యాప్రదాత ప్రముఖ గాంధేయవాది మాజీ మంత్రి మహేంద్రనాథ్ 19వ వర్ధంతి సందర్భంగా నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం జొన్నలబొగుడ బస్ స్టేజ్ వద్ద బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు తన సొంత డబ్బులతో ఏర్పాటు చేసిన మహేంద్రనాథ్ కాంస్య విగ్రహాన్ని ఆయన తనయుడు, కర్ణాటక రాష్ట్ర రిటైర్డు డీజీపీ రవీంద్రనాథ్‌తో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా విగ్రహావిష్కరణ సభ వద్ద రెండు నిమిషాలు మౌనం పాటించి నివాళులర్పించారు. అనంతరం సభలో సుధాకర్‌రావు మాట్లాడుతూ అన్ని అభ్యుదయ భావాలు కలిగిన మహనీయుడు, విలువలకు కట్టుబడి అట్టడుగు వర్గాల పిల్లల కోసం సేవ చేసిన మహనీయుడు గాంధేయవాది మార్గంలో పయనించిన మహనీయుడు పుట్టపాగ మహేంద్రనాథ్ అని సుధాకర్‌రావు కొనియాడారు. నాగర్‌కర్నూల్ జిల్లాకు మహేంద్రనాథ్ జిల్లాగా నామకరణం చేయాలని అందుకోసం అందరం సంకల్పంతో ముందడుగు వేద్దామని వారి ఆశయాల జీవిత చరిత్రను భావితరాలకు అందించేందుకు పాఠ్యాంశంలో చేర్చాలని ఆయన రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి మహేంద్రనాథ్ తనయుడు, రిటైర్డు డీజీపీ మహేంద్రనాథ్ మాట్లాడుతూ ఈ ప్రాంతానికి బడుగు, బలహీన వర్గాల ప్రజలకు ఆయన ఎంతో సేవ చేశారని ఆయన సేవలు చిరస్మరణీయమని ఇది చారిత్రాత్మక ఘట్టమన్నారు. రాజకీయాల్లో వారసత్వం ఉండకూడదని తన తండ్రి చెప్పేవారని తాను రాజకీయాల పట్ల నిరాసక్తతో ఉన్నానని ఆయన స్పష్టం చేశారు. తన తండ్రి సేవలను గుర్తించి భారీ విగ్రహాన్ని ఏర్పాటుచేసిన సుధాకర్ రావును కిరీటంతో కూడిన తలపాగ పెట్టి చందనమాల వేసి శాలువా కప్పి ఆయన ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ రాఘవులు, బీజేపీ వనపర్తి జిల్లా నాయకుడు ధారాసింగ్, పార్టీ పెద్దకొత్తపల్లి మండల అధ్యక్షుడు భీమేష్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు. అనంతరం ఆయన తన తండ్రి మాజీ మంత్రి పుట్టపాగ మహేంద్రనాథ్ 19వ వర్ధంతి సందర్భంగా జొన్నలబొగుడ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు మహనీయుల జీవిత చరిత్ర పుస్తకాలు 7, 8 తరగతుల విద్యార్థులకు దుస్తులను, స్వీట్లను పంపిణీ చేశారు. ఆ తర్వాత రవీంద్రనాథ్‌ను ఆ పాఠశాల ఉపాధ్యాయ బృందం శాలువా, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. పాఠశాల హెచ్‌ఎం రాములు నాయక్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన రిటైర్డు హెచ్‌ఎం కల్యాణ నరసింహ, డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్ కృష్ణయ్య, డాక్టర్ రాఘవులు, రిటైర్డు విజిలెన్స్ సెక్యూరిటీ ఇన్‌స్పెక్టర్ నరసింహ, ఎయిర్‌పోర్టు సీనియర్ కమాండర్ సురేందర్, రిటైర్డు డీఎంహెచ్‌వో మురళీ మోహన్, ఐక్యవేదిక కార్యదర్శి బాలరాజు తదితరులున్నారు.



మహేంద్రనాథ్ కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న రిటైర్డు డీజీపీ రవీంద్రనాథ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎల్లేని సుధాకర్‌రావు

జూరాల ప్రాజెక్టుతో జిల్లా సస్యశ్యామలం

- సాగుకు పుష్కలంగా సాగునీరు

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- కుడి కాలువ ద్వారా నీటి విడుదల

ధరూరు, జూలై 17 : జూరాల ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి పాలమూరు జిల్లాను సస్యశ్యామలం చేశామని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి అన్నారు. రైతుబంధు, వ్యవసాయానికి 24 గంటల కరెంటు అమలు చేస్తున్నామని, సాగునీటి అవసరాల కోసం రిజర్వాయర్లను పూర్తి చేసి, వ్యవసాయానికి పెద్దపీట వేశామని తెలిపారు. ధరూరు మండల పరిధిలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు కుడి కాలువకు బుధవారం ఆయన ప్రత్యేక పూజలు చేసి, సాగునీటిని విడుదల చేశారు. అనంతరం మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర పాలనలో పాలమూరు జిల్లా ప్రజలు కరువు, కష్టాలు, కన్నీటిని దిగమింగుకుని బతుకు జీవుడా అంటూ వలసలు వెళ్లే పరిస్థితి ఉండేదన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధన అనంతరం పాలమూరు జిల్లా జలకళతో అన్నపూర్ణగా మారిందని తెలిపారు. కృష్ణానదికి వరద ఉధృతి పెరగడంతో ఆల్మట్టి డ్యాం గేట్లను ఎత్తివేశారని, దిగువనున్న నారాయణపూర్ జలాశయంలోకి వరద నీరు వచ్చి చేరుతోందన్నారు. బుధవారం నారాయణపూర్ డ్యాంలో నీటి మట్టం గరిష్ఠ స్థాయికి చేరుకుంటుందని తెలిపారు. ఆ తర్వాత దిగువన ఉన్న జూరాలకు నీటిని విడుదల చేయనున్నారని చెప్పారు. సాగునీటిని వృథా చేయకుండా క్రమపద్ధతిలో వాడుకోవాలని రైతులకు సూచించారు. నడిగడ్డలో ప్రతీ ఎకరాలకు సాగునీరు అందిస్తున్నామని తెలిపారు. జూరాలకు వస్తున్న వరదను దృష్టిలో ఉంచుకుని నెట్టెంపాడు ఎత్తిపోతల ద్వారా ర్యాలంపాడు, గూడెందొడ్డి రిజర్వాయర్లకు నీటిని ఎత్తిపోస్తున్నట్లు తెలిపారు. అక్కడి నుంచి కాలువలకు నీటిని విడుదల చేస్తున్నామన్నారు.

బృందావన్ గార్డెన్ పూర్తికి కృషి

జూరాల ప్రాజెక్టు వద్ద అన్ని హంగులతో బృందావనం పార్కును తీర్చిదిద్దుతామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. ధరూరు మండల పరిధిలోని జూరాల ప్రాజెక్టు సమీపంలో చేపట్టిన బృందావన్ గార్డెన్ నిర్మాణ పనులను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జూరాల ప్రాజెక్టు సందర్శనకు వివిధ ప్రాంతాల నుంచి పర్యాటకులు అధిక సంఖ్యలో వస్తుంటారన్నారు. వారికి ఆహ్లాదకరంగా ఉండేలా బృందావన్ గార్డెన్‌ను పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామన్నారు. రూ.15 కోట్ల వ్యయంతో పార్కు నిర్మాణ పనులు ప్రారంభించినట్లు తెలిపారు. ఇటీవల ముఖ్యమంత్రిని కలిసినప్పుడు పార్కు నిర్మాణానికి మరో రూ.10 కోట్లు కేటాయించాలని కోరినట్లు చెప్పారు. త్వరలోనే పనులను పూర్తిచేసి, గార్డెన్‌ను పర్యాటకులకు అందుబాటులోకి తెస్తామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు గడ్డం కృష్ణారెడ్డి, పటేల్ ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎంపీపీ ప్రతాప్ గౌడ్, మాజీ వైస్ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, నాయకులు వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, ప్రభాకర్‌గౌడ్; అజయ్, డీఆర్ శ్రీధర్, రాధాకృష్ణారెడ్డి, రాఘవేంద్రారెడ్డి, డీవై రామన్న, విజయభాస్కర్‌రెడ్డి, భగీరథ వంశీ, కురుమన్న, మహబూబ్, ఈశ్వర్, హనుమంత రెడ్డి, కొత్త గణేష్, శ్రీనివాస్ రెడ్డి, నరేష్ గౌడ్, కృష్ణ, పవన్‌రెడ్డి పాల్గొన్నారు.



జూరాల కుడికాలువకు నీటిని విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి

కంప్యూటర్ ఆపరేటర్ విధులకు ఆటంకం

- ఎస్ఐకి ఫిర్యాదు చేసిన ఎంపీడీవో

గద్వాల, జూలై 17 : కార్యాలయంలో సిబ్బంది విధులకు ఆటంకం కలిగించిన వారిపై చర్యలు తీసుకోవాలని జోగుళాంబ గద్వాల జిల్లా మానవపాడు ఎంపీడీవో ఆంజనేయరెడ్డి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అమరవాయి గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు మంగళవారం ఎంపీడీవో కార్యాలయానికి వచ్చారు. కరెంట్ బిల్లు ఎక్కువగా వచ్చిందంటూ కంప్యూటర్ ఆపరేటర్‌తో దురుసుగా వ్యవహరించి, విధులకు ఆటంకం కలిగించారు. వారు దాదాపు ఆరుగురు ఉన్నారని, వారిని గుర్తించి కేసు నమోదు చేయాలని ఎస్ఐని కోరారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత, కేసు నమోదు

కల్వకుర్తి టౌన్, జూలై 17 : నాగర్‌కర్నూల్ జిల్లా కల్వకుర్తి మండలం గుండూరు గ్రామ సమీపంలోని పోలీసులు ఐదు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. గ్రామ సమీపంలోని దుందుభి వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారని పోలీసులకు సమాచారమందడంతో మంగళవారం రాత్రి ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఐదు ఇసుక ట్రాక్టర్లను గుర్తించి విచారణ అనంతరం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. బుధవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై మాధవరెడ్డి తెలిపారు.

సినీ తార రాకతో కోలాహలం

- చందనా బ్రదర్స్ షాపింగ్ మాల్‌ను ప్రారంభించిన హీరోయిన్ వైష్ణవి చైతన్య

వనపర్తి అర్బన్,జూలై17: సినీ తార కుమారి వైష్ణవి చైతన్య రాకతో వనపర్తి జిల్లా కేంద్రంలో అభిమానుల కోలాహలంగా మారింది. బుధవారం కొత్తకోట రోడ్డులోని రంగా థియేటర్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన చందనా బ్రదర్స్ షాపింగ్ , జ్యువెలరీ మాల్‌ను ఎమ్మెల్యే మేఘారెడ్డి, సినీ తార వైష్ణవి చైతన్య వేర్వేరుగా ప్రారంభించారు. మొదట జ్యోతి ప్రజ్వలన చేసి అనంతరం షాపింగ్ మాల్ అంత కలియ తిరిగారు. అనంతరం అక్కడికి విచ్చేసిన అభిమానులకు బయటికి వచ్చి అభివాదం చేస్తూ బేబీ, పుష్ప సినిమాలోని డైలాగ్‌లతో అభిమానులను అబ్బురపరిచారు. సామాన్య ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చిన్న పిల్లల నుంచి పెద్దల వరకు తక్కువ ధరలకే రకరకాల డ్రెస్సెస్ , శారీలను చందన బ్రదర్స్ నిర్వాహకులు ఏర్పాటు చేశారు. ప్రతీ ఒక్కరు సందర్శించి కొనుగోలు చేయాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ పుట్టపాకల మహేష్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు నారాయణ, బీఆర్ఎస్ జిల్లా అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్ పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న సినీ తార వైష్ణవి చైతన్య

రాష్ట్ర స్థాయి తైక్వాండో కరాటే పోటీలకు నల్లమల విద్యార్థి ఎంపిక



విద్యార్థి జమాల్‌కు మెడల్‌ను బహూకరిస్తున్న మాస్టర్

అచ్చంపేట టౌన్, జూలై 17 : రాష్ట్ర స్థాయి తైక్వాండో కరాటే పోటీలకు నల్లమల విద్యార్థి జమాల్ ఎంపికయ్యాడు. బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట పట్టణంలోని పటేల్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన పోటీల్లో పట్టణానికి చెందిన అర్శమొలల డాక్టర్ జమీల్ కుమారుడు జమాల్ ఎంపికైనట్లు కరాటే మాస్టర్ శేఖర్ తెలిపారు. విద్యార్థి రాష్ట్ర స్థాయి తైక్వాండో కరాటే పోటీలకు ఎంపిక కావడం పట్ల అచ్చంపేట మసీద్ కమిటీ సదర్ సిద్ధిఖ్, హాజీ, తాహెర్‌లు అభినందించారు.

జాతీయ స్థాయి హాకీ పోటీలకు విద్యార్థిని ఎంపిక



వర్షిత

వనపర్తి రాజీవ్ చౌరస్తా, జూలై17: ఈనెల 19వ తేదీ నుంచి కేరళ రాష్ట్రంలో నిర్వహించే సౌత్ జోన్ సబ్ జూనియర్ హాకీ నేషనల్ టోర్నమెంట్‌కు జిల్లాకు చెందిన విద్యార్థిని వర్షిత ఎంపికైనట్లు హాకీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొ లెమోని కుమార్ బుధవారం తెలిపారు. విద్యార్థిని వర్షిత ప్రస్తుతం హైదరాబాద్‌లోని స్పోర్ట్స్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ హాకీ అసోసియేషన్ వైస్ ప్రెసిడెంట్ రామ్మోహన్ , ట్రెజరర్ నిరంజన్ గౌడ్, ఫిజికల్ డైరెక్టర్ అనిల్ కుమార్ , జిల్లా హాకీ అకాడమీ కోచ్ జావిద్, సీనియర్ క్రీడాకారులు వర్షితను అభినందించారు.

ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఆప్షన్స్ గడువు మూడు నెలలు

మహబూబ్‌నగర్ టౌన్, జూలై 17 : ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగులకు గత 2017 ఏప్రిల్ నుంచి వర్తింపజేసిన పీఆర్సీకి సంబంధించిన ఆప్షన్స్ తీసుకునే గడువును మూడు నెలలుగా నిర్ణయించడం సమంజసం కాదని ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల ఫోరం జిల్లా అధ్యక్షుడు రాజసింహుడు బుధవారం ఒక ప్రకటనలో ఆక్షేపించారు. 2017 ఏప్రిల్ తర్వాత పనిచేసి రిటైరైన, మరణించిన, రాజీనామా చేసిన రిమూవల్ అయిన ఉద్యోగులను ఆప్షన్లను అడగడమే చాలా ఆలస్యం చేశారని, ఇప్పుడు అడిగిన ఆప్షన్లకు గడువును మూడు నెలలకు పెంచడం సరికాదన్నారు. ఇప్పటికే 2022 సంవత్సరం నుంచి రిటైర్డు ఉద్యోగులకు రావాల్సిన లీవ్ ఎన్‌క్యాష్మెంట్ తదితర బకాయిలు చెల్లించలేదని, ఆర్థిక ఇబ్బందులతో సతమవుతున్నామని, బకాయిలన్నింటినీ వెంటనే చెల్లించాలని ఆప్షన్ గడువు నెల రోజులకు కుదించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

108 వాహనంలో ప్రసవం

- తల్లీబిడ్డ క్షేమం



బిడ్డను చూపుతున్న వైద్యసిబ్బంది

గండీడ్, జూలై 17 : మండల పరిధిలోని రుసుంపల్లి గ్రామానికి చెందిన రామేశ్వరి అనే మహిళకు రాత్రి 11.30 గంటలకు పురిటి నొప్పులు రావడంతో 108 వాహనానికి కుటుంబీకులు సమాచారం అందించారు. వెంటనే 108 వాహనం సిబ్బంది ఆ గ్రామానికి చేరుకొని మహిళను 108 వాహనంలో గండీడ్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తీసుకొని వెళ్తుండగా మార్గమధ్యలోనే 108 వాహనంలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. దీంతో 108 వాహన సిబ్బంది అక్బర్, ఈఎంటీ లక్ష్మీనారాయణలకు ధన్యావాదాలు తెలిపారు. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని సిబ్బంది తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

అచ్చంపేట టౌన్, జూలై 17 : గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి చెందిన సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలం హాజీపూర్ గ్రామ సమీపంలోని రహదారిపై మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్సై రాము తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని హాజీపూర్ స్టేజీ వద్ద గుర్తు తెలియని వాహనం గుర్తు తెలియని వ్యక్తిని ఢీకొనడంతో అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించామన్నారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలియాల్సి ఉందన్నారు.

జములమ్మ ఆలయ సమీపంలో..

గద్వాల : జోగుళాంబ గద్వాల జిల్లా, గద్వాల మండల పరిధిలోని జములమ్మ ఆలయం సమీపంలో బుధవారం ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందినట్లు రూరల్ ఎస్ఐ పర్వతాలు తెలిపారు. అతడు కొన్నేళ్లుగా ఆలయ పరిసరాలలో భిక్షాటన చేస్తూ జీవిస్తున్నట్లు గుర్తించారు. అతడు అనారోగ్యంతో మృతి చెందినట్లు గుర్తించారు. ఆలయ ఉద్యోగి రాజలింగం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. మృతదేహాన్ని మార్చురీలో భద్రపరిచినట్లు చెప్పారు.

ఆస్తి అమ్ముతాడనే అనుమానంతోనే..

- కుటుంబ సభ్యులు హత్య చేశారు

- నర్సింహులు మృతిని ఛేదించిన పోలీసులు

పెబ్బేరు, జూలై 17 : తాగుడుకు బానిసైన ఇంటి యజమాని ఆస్తిని అమ్ముతాడనే భయంతోనే కుటుంబ సభ్యులు అతన్ని హత్య చేశారు. ఈనెల 13న ఈ హత్య జరగగా, పోలీసులు అప్పట్లో హత్య కేసుగా నమోదు చేసి, విచారించగా, కుటుంబ సభ్యులే హత్య చేసినట్లు సాక్ష్యాధారాలను సేకరించి, బుధవారం కేసు వివరాలను వెల్లడించారు. శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామానికి చెందిన కోమరి నరసింహులు భార్య, కొడుకు, కోడలితో కలిసి మండల కేంద్రమైన పెబ్బేరులోని వినాయకనగర్ కాలనీలో ఉంటున్నారు. తాగుడుకు బానిస అయిన నర్సింహులు భూమిని అమ్మకానికి పెట్టినట్లు కుటుంబ సభ్యులకు తెలిసింది. ఈనెల 13న అతన్ని కొట్టి చంపారు. నర్సింహులు అన్న కుమారుడు అయిన కోమరి ప్రమోద్‌కుమార్ అనే యువకుడికి అనుమానం వచ్చి తమ చిన్నాన్నను ఎవరో కొట్టి చంపారని పెబ్బేరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అనుమానాస్పద మృతి కింద కేసు నమోదు చేసిన పోలీసులు అప్పటి నుంచి విచారణ చేపట్టిన మృతికి గల కారణాలను కనుగొన్నారు. తాగుడుకు బానిసైన నర్సింహులు తమకున్న భూమిని అమ్మడానికి ప్రయత్నించడంతో అతని భార్య గోవిందమ్మ, కుమారుడు శివ కుమార్, అతని భార్య సుహాసిని ఎలాగైనా హతమార్చాలని పథకం పన్నారు. గొడ్డలితో అతని కాళ్లు, ఎద, తలపై కొట్టి చంపినట్లు నిర్ధారణ కావడంతో వారిపై కేసు నమోదు చేసి ముగ్గురిని బుధవారం సాయంత్రం అరెస్టు చేసి వనపర్తి కోర్టుకు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

రేషన్ కార్డు గుర్తింపు కోసమే..

- నేటి నుంచే రుణమాఫీ.. రైతు సంబురాలు
- బీజేపీ దద్దమ్మలు వక్రీకరించే ప్రయత్నం చేస్తున్నారు
- దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి

మహబూబ్‌నగర్, జూలై 17 : రైతురుణ మాఫీతో కాంగ్రెస్ చరిత్రలో నిలిచిపోతుందని, దీన్ని జీర్ణించుకోలేని విపక్షాలు రుణమాఫీపై దుష్ప్రచారం చేసే ప్రయత్నం చేస్తున్నారని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి మండిపడ్డారు. రుణమాఫీకి రేషన్ కార్డు అనేది గుర్తింపుకోసమే తప్ప అది ప్రామాణికం కాదని, ఈ విషయాన్ని ప్రభుత్వం స్పష్టంగా చెప్పినా ఇంకా బీజేపీ దద్దమ్మలు వక్రీకరిస్తూ మాట్లాడటం సిగ్గు చేటన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ రుణమాఫీపై చరిత్రాత్మక నిర్ణయం తీసుకుందని, బీజేపీ పాలిత రాష్ట్రాలలో ఎక్కడైనా రుణమాఫీ చేశారా అని ప్రశ్నించారు. ఆరు గ్యారెంటీలలో కేవలం మహిళలకు ఉచిత బస్సు తప్ప ఏ హామీని అమలు చేయలేదని, ఇక్కడి బీజేపీ ఎంపీ మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. మీరు ఎంపీగా ఎలా గెలిచారో అందరికీ తెలుసునని, బీఆర్ఎస్ ఓట్లతో గెలిచిన మీరు నేను ముఖ్యమంత్రి జిల్లాలో గెలిచానని చెప్పుకోవడం దుర్మార్గమన్నారు. బీజేపీ రైతులకు రుణమాఫీ చేయదు కానీ, బడా కార్పొరేట్‌లు, పారిశ్రామికవేత్తలకు రూ.25 లక్షల కోట్ల రుణాలు మాఫీ చేసిన చరిత్ర మీదన్నారు. బీఆర్ఎస్‌కు మనుగడ, భవిష్యత్ లేదని ఆపార్టీ ఎమ్మెల్యేలు ప్రజాపాలన అందిస్తున్న కాంగ్రెస్‌లో చేరుతున్నారని ఆయన అన్నారు. గతంలో మీరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలను భయపెట్టి కాంగ్రెస్‌లో చేర్చుకుని మంత్రి పదవులు కూడా ఇచ్చారని, ఇప్పుడు అదే బీఆర్ఎస్ నాయకులు పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను కలవడం విచారకరమన్నారు. రైతులంతా పెద్దఎత్తున సంబురాలు చేసుకోవాలని, ముందుగా లక్ష లోపు, రుణాలు తొందర్లోనే రూ.2 లక్షల రుణాలను మొత్తం మాఫీ చేస్తామన్నారు. సమావేశంలో నాయకులు అరవింద్‌రెడ్డి, సీజే బెనహర్, చంద్రశేఖర్, నాగిరెడ్డి పాల్గొన్నారు.

ప్రతీ కుటుంబానికి పథకాలను అందిస్తాం : ఎమ్మెల్యే

దేవరకద్ర, జూలై 17 : కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో అర్హులైన ప్రతీ కుటుంబానికి పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే జి.మధుసూదన్‌రెడ్డి అన్నారు. బుధవారం చిన్నచింతకుంట మండల పరిధిలోని దమగ్నాపూర్ గ్రామంలో ఎమ్మెల్యే ఇంటి దగ్గర దేవరకద్ర, చిన్నచింతకుంట మండలాలకు చెందిన లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం రైతులకు రూ. రెండు లక్షల రుణమాఫీ చేసి చరిత్రలో నిలిచారన్నారు. ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ అరవింద్‌కుమార్‌రెడ్డి, రెండు మండలాల పార్టీ అధ్యక్షులు అంజిల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, మండల నాయకులు లక్ష్మీకాంత్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఆది హన్మంతురెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, హన్మంతురెడ్డి, నరసింహారెడ్డి, కిషన్‌రావు, రాంపాండు, ఫారుక్‌అలీ, నరసింహ, తహసీల్దార్ ఎల్లయ్య, ఆర్ఐ శరత్, సురేష్, మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

అయ్యప్ప క్షేత్రంలో భక్తిశ్రద్ధలతో పూజలు



మూసాపేట అయ్యప్పదేవాలయంలో పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

అడ్డాకుల, జూలై 17 : మండల కేంద్రమైన మూసాపేట సమీపంలో ఉన్న సంకల్పసిద్ధి హరిహర అయ్యప్పక్షేత్రంలో తొలిఏకాదశిని పురస్కరించుకొని బుధవారం గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. అయ్యప్పస్వామి, వినాయకుడు, కుమారస్వామి విగ్రహాలకు పంచామృతంతో అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అర్చకులు భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అదేవిధంగా మండలంలో భక్తులు దేవాలయాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజా కార్యక్రమాలలో ఆలయ కమిటీ అధ్యక్షుడు తిరుపతయ్యగౌడ్, ఉపాధ్యక్షుడు కొంగరి శ్రీనివాసులు, గౌరవాధ్యక్షుడు కొండయ్య కమిటీ సభ్యులు గట్టు నరేశ్, వెంకటేశ్, భక్తులు పాల్గొన్నారు.

● ఎస్ఐని సన్మానించిన గ్రామస్థులు : మూసాపేట మండల పోలీస్ స్టేషన్‌కు కొత్తగా వచ్చిన ఎస్ఐ శ్రీనివాసులును బుధవారం గ్రామస్థులు, కాంగ్రెస్ నాయకులు పోలీస్ స్టేషన్‌లో ఘనంగా సన్మానించారు.

ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ



జడ్చర్ల ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

జడ్చర్ల, జూలై 17 : జడ్చర్ల పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కాంగ్రెస్ నాయకులు అందజేశారు. ఎమ్మెల్యే జనంపల్లి అనిరుధ్‌రెడ్డి ఆదేశాల మేరకు క్యాంపు కార్యాలయంలో జడ్చర్ల మునిసిపాలిటీతో పాటు మండలంలోని 60 మంది లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర సంగీత, నాటక అకాడమీ మాజీ చైర్మన్ బాద్మి శివకుమార్ సమక్షంలో చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మినాజ్, బుర్ల వెంకటయ్య, బుక్క వెంకటేశ్, నిత్యానందం, మాలిక్ షాకీర్, రమేశ్, తుంగరఘు, శ్యామ్, సూరిశెట్టి పవన్, భాస్కర్‌రెడ్డి, ఆనంద్, నక్కా రాఘవేందర్, లక్ష్మమ్మ పాల్గొన్నారు.

మీరు స్పందిస్తలేరు.. మేమే ప్రారంభిస్తాం

- బాలికల హాస్టల్, సింథటిక్ ట్యాంక్, క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని స్పష్టం
- పీయూ అధికారులను హెచ్చరించిన ఏబీవీపీ నాయకులు



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న ఏబీవీపీ నాయకులు

పాలమూరు యూనివర్సిటీ, జూలై 17 : అధికారులు స్పదించకపోవడంతో ఏబీవీపీ ఆధ్వర్యంలో నేడు యూనివర్సిటీలోని బాలికల హాస్టల్, సింథటిక్ ట్యాంక్, క్యాంటీన్‌ను ప్రారంభిస్తామని అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం పీయూలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ పీయూలో విద్యార్థులు ఎన్ని అవస్థలు పడుతున్నా అధికారులు, అటు ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, బాలికల హాస్టల్‌ను, క్యాంటిన్, 400 మీటర్ల సింథటిక్ ట్రాక్‌ను ప్రారంబించాలని పలుమార్లు డిమాండ్ చేసినా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇటీవల యూనివర్సిటీకి రాకుండా వర్చువల్‌గా శిలఫలకాలు ప్రారంభించారని, ఇప్పటి వరకు అవి విద్యార్థులకు అందుబాటులోకి రాలేదని అన్నారు. విద్యార్థిని, విద్యార్థులకు మౌలిక వసతులు లేవని అన్నారు. యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించకపోతే తమ సంఘం ఆధ్వర్యంలో ఉద్యమాలను చేస్తామని హెచ్చరించారు. ఈ విలేకరుల సమావేశంలో ఏబీవీపీ పీయూ కార్యదర్శి శివకుమార్, నాయకులు వేణుగోపాల్, శశికుమార్, శివప్రసాద్, ప్రకాష్, రవి, బాలరాజు, నీరేష్, శ్రీను, శ్రీధర్ కుమార్ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో తొలి ఏకాదశి పర్వదినం

- ఇక్కడి నుంచే హిందూ పండగలు ప్రారంభం
- భక్తులతో కిటకిటలాడిన దేవాలయాలు

మహబూబ్‌నగర్ టౌన్/ మహబూబ్ నగర్ రూరల్/ చిన్నచింతకుంట/ జడ్చర్ల/ దేవరకద్ర/ మహమ్మదాబాద్, జూలై 17 : మహబూబ్‌నగర్ పట్టణంలో తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా బుధవారం విష్ణు దేవాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఈ ఏకాదశి అంటేనే మంచి దినమని, తొలి ఏకాదశి అంటే ఇంకా మంచి రోజని, ఏకాదశి నుంచే హిందువుల పర్వదినాలు ప్రారంభం అవుతాయని ప్రతీతి. స్థానిక ఏనుగొండ శివాలయం, కాటన్ మిల్లు వేంకటేశ్వర ఆలయం, కొత్తగంజ్ లక్ష్మీనర్సింహ స్వామి దేవాలయం, రాజేందర్‌నగర్ శివాలయంలో, శ్రీనివాసకాలనీ పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంతో పాటు పలు దేవాలయాలు భక్తులతో రద్దీగా మారాయి. ఉదయం నుంచి భక్తులు విచ్చేసి స్వామి వారిని ప్రత్యేక పూజలు నిర్వహించారు. తొలి ఏకాదశి నుంచి స్వామి వారు యోగ నిద్రకు వెళ్లారని పురాణాలు చెపుతాయి. తొలి ఏకాదశి రోజు భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి ఇంట్లో దైవానికి ప్రత్యేక పూజలు నిర్వహించి, అనంతరం దేవాలయం వెళ్లి స్వామి వారికి అభిషేకం లేదా అర్చన నిర్వహించి తీర్థ ప్రసాదాలు తీసుకుంటారు.

● మహబూబ్ నగర్ రూరల్ మండలంలో తొలి ఏకాదశి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మన్యంకొండ దేవస్థానంలో శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామివారి ఆలయ ధర్మకర్త అలహరి మధుసూదన్ కుమార్ స్వామివారికి మంగళ స్నానాలు చేయించి, అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహిచారు. మన్యంకొండపై వెలిసిన శివాలయంలో రామలింగేశ్వర స్వామికి అభిషేకాలు నిర్వహించారు. మన్యంకొండ దేవాస్థానం కార్య నిర్వహణ అధికారి శ్రీనివాసరాజు, వంశపారంపర్య ధర్మకర్త అలహరి రామకృష్ణ, ఆలయ సూపరింటెండెంట్ నిత్యానందం పాల్గొన్నారు.

● చిన్నచింతకుంట మండలం కురుమూర్తి వేంకటేశ్వర స్వామి వారి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా స్వామి వారికి లక్ష పుష్పార్చన పూజ కార్యక్రమం నిర్వహించారు. ఆలయ ఈవో మదనేశ్వర్ రెడ్డి, మాజీ చైర్మన్లు సురేందర్‌రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సిబ్బంది శ్రీకర్, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు. చిన్నచింతకుంట మండలంలోనూ తొలి ఏకాదశి పూజలు చేశారు.

● జడ్చర్ల : జడ్చర్ల మున్సిపాలిటీ, మండలంలోని ప్రజలు ఆషాఢ శుద్ధ ఏకాదశి (తొలిఏకాదశి, శయనేకాదశి) సందర్భంగా జడ్చర్ల మండలంలోని గంగాపురం శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని వేదపండితులు ఘనంగా జరిపించారు. సాయంత్రం శ్రీలక్ష్మీ దేవీకి మహిళలచే కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. జడ్చర్ల పట్టణంలోని శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయంలో స్వామికి పంచామృత అభిషేకం ఆలయ పూజారి సుధీంద్రచారి నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జడ్చర్ల : గంగాపురం లక్ష్మీచెన్నకేశవస్వామి దేవాలయంలో లక్షపుష్పార్చన నిర్వహిస్తున్న పూజారులు



మహబూబ్‌నగర్‌లో ఏనుగొండ సాంబశివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

● దేవరకద్ర నియోజకవర్గంలోని దేవరకద్ర, కౌకుంట్ల మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో ఆంజనేయస్వామి దేవాలయంలో వాసవీమాత ఆలయంలో, కనకదుర్గ అమ్మవారి ఆలయంలో బుధవారం ఏకాదశి వేడుకలను భక్తులు ఘనంగా జరుపుకున్నారు. భక్తులు ఉపవాస దీక్షలు చేపట్టి ఆలయంలో, ఇంట్లో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఆలయంలో భజనలు చేశారు.

● మహమ్మదాబాద్ మండలంలో తొలి ఏకాదశి వేడుకలు బధవారం ఘనంగా నిర్వహించారు. గాధిర్యాల్ పరిధిలోని బొట్లగడ్డతండాలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహమ్మదాబాద్, చౌదర్‌పల్లి, నంచర్ల తదితర గ్రామాల్లో వేంకటేశ్వర, రామాలయాలు భక్తులతో రద్దీగా కనిపించాయి.

నేడు రైతు వేదికలలో సంబురాలు

మహబూబ్‌నగర్ (కలెక్టరేట్), జూలై 17 : ప్రభుత్వం రుణమాఫీకి శ్రీకారం చుట్టినందున రుణమాఫీ పొందిన రైతులతో నేడు రైతు వేదికలలో సంబురాలు జరుపుకోవాలని కలెక్టర్ విజయేందిర బోయి తెలిపారు. ఇందుకు గాను అవసరమైన అన్ని ఏర్పాట్లు చేయాలని ఆమె వ్యవసాయ అధికారులను ఆదేశించారు. ఈ విషయమై బుధవారం ఆమె జిల్లా వ్యవసాయశాఖ అధికారి, వ్యవసాయ శాఖ ఏడీలు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులతో వెబెక్స్ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం 2 లక్షల రూపాయలలోపు రుణాలు ఉన్న రైతులకు రుణ మాఫీ ప్రకటించిందని, ఇందులో భాగంగా గురువారం లక్ష రూపాయలలోపు రుణాలున్న రైతుల రుణమాఫీ అవుతుందని తెలిపారు. ఇందుకు సంబంధించి రైతుల వివరాలన్నీ వ్యవసాయ శాఖ అధికారులు జిల్లా కలెక్టర్‌లకు పంపించడం జరిగిందని తెలిపారు. ఈ మేరకు రుణ మాఫీ పొందిన రైతులు గురువారం సాయంత్ర 4 గంటలవరకు సంబంధిత రైతువేదికల వద్దకు చేరుకుంటారని, సాయంత్రం 4 గంటలకు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి రుణ మాఫీ పొందిన రైతులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా నేరుగా మాట్లాడుతారని కలెక్టర్ తెలిపారు. ఇందుకు గాను జిల్లాలోని మండలంలోని ఒక రైతు వేదిక చొప్పున 16 మండలంలోని 16 రైతు వేదికల వద్ద అవసరమైన ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ఎమ్మెల్యేలు పాల్గొంటారని తెలిపారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, ఎల్‌డీఎం భాస్కర్, జిల్లా వ్యవసాయ అధికారి వెంకటేశ్, మండలాల వ్యవసాయ అధికారులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

● మహమ్మదాబాద్ : మండల కేంద్రంలోని రైతు వేదికలో గురువారం సాయంత్రం రుణమాఫీ రైతు సంబురాలు నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కేయం నారాయణ ప్రకటనలో తెలిపారు.

భక్తి శ్రద్ధలతో మొహర్రం

- కందూర్లు చేసి మొక్కులు చెల్లించుకున్న ప్రజలు
- షర్బత్ పంపిణీ చేసిన ముస్లిం యువకులు



రాజాపూర్ : ఖానాపూర్ గ్రామంలో పీర్ల ఊరేగింపులో పాల్గొన్న గ్రామస్థులు

మహబూబ్‌నగర్ అర్బన్/ జడ్చర్ల/ గండీడ్/ రాజాపూర్/ హన్వాడ, జూలై 17 : త్యాగానికి ప్రతీకగా జరుపుకునే మొహర్రం పండుగను జిల్లా కేంద్రంలో ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. షహదాత్ రోజైన బుధవారం పీర్లను నిమజ్జనంతో వేడుకలు ముగిశాయి. జిల్లా కేంద్రంలోని ఇమామే హస్సేన్, హుస్సేన్ పోరాట యోధులను స్మరించుకు న్నారు. సాయంత్రం పాత పాలమూరు, టీడీగుట్ట పీర్ల మసీదు వద్ద భక్తుల కోలా హలం కనిపించింది. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి పీర్లను దర్శంచుకుని మొక్కులు చెల్లించుకున్నారు. వన్ టౌన్, పాతపాలమూరు ప్రధాన వీధుల్లో పీర్లను ఊరేగించారు. పలు చోట్ల ముస్లిం యువకులు షర్బత్ పంపిణీ చేశారు.

● జడ్చర్ల మునిసిపాలిటీతో పాటు మండల వ్యాప్తంగా పీర్ల పండుగను ఘనంగా జరుపుకున్నారు. పాతబజారులోని పీర్ల మజీదు నుంచి పీర్లను పట్టణంలోని కాలనీలలో, ప్రధాన రహదారుల గుండా ఊరేగించారు. ఊరేగింపుగా వచ్చిన పీర్లకు భక్తులు మాలీజా, దట్టీలను అందజేసి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో పట్టణంలోని వివిధ పార్టీల నాయకులు, కుల, మతాలకతీతంగా భక్తులు పాల్గొన్నారు.

● గండీడ్ : మండల పరిధిలోని వెన్నాచేడ్, సల్కర్‌పేట్, గండీడ్, పెద్దవర్వాల్, రుసుంపల్లి, బల్సూర్‌గొండ, పగిడ్యాల్ తదితర గ్రామాల్లో పీర్ల పండుగను కులమతాలకు అతీతంగా ప్రజలు ఘనంగా జరుపుకున్నారు.



పాతపాలమూరులో మొహర్రం వేడుకలు

● రాజాపూర్‌తో పాటు మండల పరిధిలోని ముదిరెడ్డిపల్లి, మల్లేపల్లి, చొక్కం పేట, ఖానాపూర్ తదితర గ్రామాల్లో మొహర్రం పండుగను ప్రజలు భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. పీర్లను గ్రామాల్లో ఊరేగించి, భక్తులకు దర్శనం ఇచ్చారు. అనంతరం నిమజ్జనానికి తరలించారు.

● హన్వాడ మండలంలో పీర్ల పండుగను ప్రజలు బుధవారం ఘనంగా జరుపుకున్నారు. హన్వాడలో భారీగా ప్రజలు పాల్గొన్నారు.

● మహమ్మదాబాద్ మండల పరిధిలో మొహర్రం పండుగను ఘనంగా నిర్వహించారు. ధర్మాపూర్, మహమ్మదాబాద్, నంచర్ల, గాధిర్యాల్, చౌదర్ పల్లి శేక్‌పల్లితో పాటు పలు గ్రామాల్లో పీర్ల పండుగ భక్తి శ్రద్ధలలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురుషులు అలయ్ ఆడగా, మహిళలు బొడ్డుమ్మలు వేశారు. పీర్ల ఊరేగింపు ఘనంగా నిర్వహించారు.

ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

పాలమూరు, జూలై 17 : ఏకలవ్యుడు స్ఫూర్తి ప్రదాత అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని గ్రీన్‌బెల్ట్ ఏరియాలోని ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గురువు లేకపోయినా విలువిద్యలో రాణించారని, పట్టుదల, మంచి సంకల్పం ఉంటే ఏదైనా సాధ్యమన్నారు. వారి జీవితమే నేటి భారతీయులకు స్ఫూర్తి కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, బాలయ్య, సంజీవ్ ముదిరాజ్, వినోద్‌కుమార్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, పొన్నకల్ కృష్ణయ్య పాల్గొన్నారు.

మహనీయుల చరిత్ర భావి తరాలకు తెలపాలి

- ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

మహనీయల చరిత్ర భవిష్యత్ తరాలకు తెలపాలన్నదే బీఆర్ఎస్ లక్ష్యమని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్‌లు అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ఏకలవ్య జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. మహనీయుల చరిత్ర తెలుసుకుని నేటితరం స్ఫూర్తి పొందుతారన్నారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కె.సీ నరసింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజు, కౌన్సిలర్లు టి.గణేష్, కట్టా రవికిషన్‌రెడ్డి, నాయకులు నవకాంత్, సుధాకర్, మల్లేష్, సత్యం, కిషన్ పవార్ పాల్గొన్నారు.



ఏకలవ్యుడి విగ్రహానికి పూలమాలవేస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

కొలిచినవారికి కొంగుబంగారం తోటమైసమ్మ



తోట మైసమ్మ విగ్రహం

పాలమూరు, జూలై 17 : పట్టణంలోని కుర్హిణిశెట్టి కాలనీలో వెలిసిన తోటమైసమ్మ దేవత కొలిచినవారికి కొంగుబాగరమని ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బుట్ట రామస్వామి, కనికె రామలింగం, కార్యదర్శి కామర్తి ఈశ్వరయ్య, ఉత్సవ సమితి పెద్దలు అన్నారు. బుధవారం వారు మీడియాతో మాట్లాడుతూ జూలై 21న పల్లకిసేవ, దాతలు నిర్మించిన దేవాలయ ముఖద్వార (కమాన్) ప్రారంభోత్సవం ఎమ్మెల్యే, ఎంపీల చేత చేయిస్తామన్నారు. ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి చేత 28వ తేదీన అభిషేకం, అలంకరణ, అర్చన, మహానీరాజనం, బోనాల పండుగ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆగస్టు 4వ తేదీన విశేష అభిషేకం, అలంకరణ, నివేదన, అన్నదానం చేయనున్నట్లు వారు వివరించారు. పూజారి జ్యోషి సంతోషాచార్యుల చేత ప్రత్యేక పూజలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమాలలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారి కృప, ఆశీస్సులు పొందాలని కోరారు.

పాండురంగ స్వామి అనుగ్రహం ఉండాలి

పాలమూరు, జూలై 17 : పాండురంగస్వామి అనుగ్రహం అందరిపై ఉండాలని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని బండ్లగేరిలో పాండురంగస్వామి దేవాలయంలో తొలి ఏకాదశి సందర్భంగా ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు. ఎంతో పురాతనమైన దేవాలయం అందరం కలిసి పునఃనిర్మాణం చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. రెండు రోజులపాటు జరిగే రుక్మిణి పాండురంగస్వామి కల్యాణోత్సవంలో ప్రట్టణ ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కె.శ్రావణ్‌కుమార్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్‌యాదవ్, లక్ష్మయ్య, చిన్న, రఘు, ఆనంద్‌కుమార్, ప్రవీణ్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఈనెల 21న విశ్వకర్మల మహాధర్నా

దేవరకద్ర, జూలై 17 : ఈ నెల 21 విశ్వకర్మల మహాధర్నా కార్యక్రమం ఉందని ఆ సంఘం యువనాయకుడు వడ్ల అర్జున్‌చారి బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ విశ్వబ్రాహ్మణుల రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కమ్మరి వడ్రంగి కుల వృతుల సమస్యలపై హైదరాబాద్ ఇందిరా పార్కు ధర్నాచౌక్ దగ్గర మహా ధర్నా కార్యక్రమం ఉంటుందని, విశ్వకర్మలు అందరు పాల్గొనాలని కోరారు.

2373 మంది రైతులకు రుణ మాఫీ

హన్వాడ, జూలై 17 : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన రైతు రుణమాఫీలో మండలానికి చెందిన 2373 మంది రైతులకు మొదటి విడతలో రుణమాఫీ అవుతుందని మండల వ్యవసాయాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. బుధవారం ప్రభుత్వం విడుదల చేసిన మొదటి జాబితాలో 2373 పేర్లు వచ్చాయని, గురువారం మాఫీ డబ్బులు రైతుల ఖాతాల్లో జమ అవుతాయని తెలిపారు. టంకర రైతు వేదికలో జరిగే కార్యక్రమానికి రైతులు హాజరుకావాలని కోరారు.

నేడు రైతు సంబురాలు

గండీడ్, జూలై 17 : నేడు మండల పరిధిలోని పెద్దవార్వల్ క్లస్టర్‌లోని రైతు వేదిక దగ్గర రైతు సంబురాలు నిర్వహించనున్నట్లు వ్యవసాయాధికారి ఫనీషా బుధవారం ఒక ప్రకటలో తెలిపారు. ముఖ్యమంత్రి ఆదేశానుసారం నేడు రుణం తీసుకున్న రైతులకు 1లక్ష వరకు రుణం మాఫీ అవుతుందని తెలిపారు. ఈ సంబురాలకు పరిగి ఎమ్మెల్యే టి.రామ్మోహన్‌రెడ్డిపాల్గొంటారని, మండలంలోని రైతులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొనాలని కోరారు.

పండుగ సాయన్నకు ఘన నివాళి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాసరెడ్డి

పాలమూరు, జూలై 17 : బహుజన వీరుడు పండుగ సాయన్న అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీని వాస్‌రెడ్డి అన్నారు. బుధవారం పండుగ సాయన్న 133వ జయంతి సందర్భంగా పట్టణంలోని గ్రీన్‌బెల్ట్ ప్రాంతంలో ఆయన విగ్రహానికి మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి పూలమాలవేసి నివాళి అర్పించారు. తెలంగాణ చౌరస్తాలో మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరితో కలిసి ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి పండుగ సాయన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆనంద్ కుమార్‌గౌడ్, ప్రముఖ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదు ల్లా కొత్వాల్, బాలయ్య సంజీవ్ ముదిరాజు, వినోద్‌కుమార్, బెక్కరి మధుసూదన్‌రెడ్డి, సత్తూరు చంద్రకుమార్‌గౌడ్, సిరాజ్‌ఖాద్రి, లక్ష్మణ్ యాదవ్, కృష్ణయ్య పాల్గొన్నారు.

పండుగ సాయన్న చరిత్రను రాష్ట్ర వ్యాప్తం చేసినం

- ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్

బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో పండుగ సాయన్న చరిత్రను రాష్ట్ర వ్యాప్తం చేశామని ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ వి.శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం పండుగ సాయన్న 133 జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ పండుగ సాయన్న వారసులను అన్ని విధాలుగా ఆదుకున్నామని వివరించారు. అనంతరం వీరన్నపేటలో ఆయన సమాధివద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో మునిసిపల్ మాజీ చైర్మన్ కె.సీ నరసింహులు, ముడా మాజీ చైర్మన్ గంజి వెంకన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు శివరాజు, కౌన్సిలర్లు టి.గణేష్, కట్టా రవికిషన్‌రెడ్డి, నాయకులు నవకాంత్, సుధాకర్, మల్లేష్, సత్యం, కిషన్ పవార్ పాల్గొన్నారు.

పండుగ సాయన్న చిరస్మరణీయుడు : సంజీవ్ ముదిరాజ్

పేదలకోసం పనిచేసిన పండుగ సాయన్న చిరస్మరణీయుడని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి సంజీవ్‌ముదిరాజు, బీసీల నాయకులు అన్నారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగ బుధవారం వీరన్నపేటలోని ఆయన సమాధి వద్ద నివాళి అర్పించారు. కార్యక్రమంలో నాయకులు శివన్న, కృష్ణముదిరాజ్, జంగయ్య, పద్మ నరేష్,పవన్‌కుమార్, శ్రీనివాసరాజు పాల్గొన్నారు.

● గండీడ్ : మండల కేంద్రంలో పండుగ సాయన్న జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ముదిరాజ్ సంఘం మండల అధ్యక్షుడు బోయిని గోపాల్ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి ఘనంగా నివాళి అర్పించారు. ముదిరాజ్ సంఘ ఉపాధ్యక్షులు గిరిమోని అంజిలయ్య, వెంకటయ్య, ఆంజనే యులు, ప్రధాన కార్యదర్శి కేశవులు, మాజీ ఎంపీటీసీ బాలయ్య మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రామచంద్రారెడ్డి, మాజీ సర్పంచు హన్మంతు, సలహాదారుడు నర్సప్ప, వెన్నాచేడ్ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కె.నర్సింములు, డీఎస్‌పీ అధ్యక్షుడు పసుల శ్రీను, ఆనంద్, రఘు, ఆయా గ్రామాల అధ్యక్ష, కార్యదర్శులు, ముదిరాజ్, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.



పండుగ సాయన్నకు నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ మంత్రి వి.శ్రీనివాస్‌గౌడ్, నాయకులు

పెత్తందారి వ్యవస్థను రూపుమాపిన ధీశాలి

పాలమూరు : పెత్తందారి వ్యవస్థను రూపుమాపిన ధీశాలి పండుగ సాయన్న అని బీసీ సమాజ్ రాష్ట్ర కార్యదర్శి యం.శ్రీనివాస్ అన్నారు. బుధవారం పండుగ సాయన్న జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో ఆయన విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఆశన్న, పద్మశాలి నాయకులు సారంగి లక్ష్మీకాంత్, జాంగ్రసంఘం నాయకులు మహేందర్, సవారి సత్యం, యాంకి రమేష్ పాల్గొన్నారు.

పండుగ సాయన్న ఆదర్శ ప్రాయుడు

నవాబ్‌పేట : బడుగు, బలహీన వర్గాల ప్రజలకు పండుగ సాయన్న ఆదర్శ ప్రాయుడని, ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని కాంగ్రెస్ మండల నాయకులు భూపాల్ రెడ్డి, పోమాల లింగం అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో పండుగ సాయన్న జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. మండలంలోని మరికల్ గ్రామంలో బీసీ నాయకులు పిట్టల నర్సింహులు ఆధ్వర్యంలో పండుగ సాయన్న జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో పుట్టి ఆంజనేయులు, కోట్ల రాజేష్, శిర్ప సత్యం, శివకుమార్, పాండు పాల్గొన్నారు.



గండీడ్‌లో పండుగ సాయన్న చిత్ర పటానికి నివాళ్ళు అర్పిస్తున్న ముదిరాజ్ సంఘ నాయకులు